క్లుప్తంగా

శుభాకాంక్షలు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

ఫిలింనగర్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు శుభాకాంక్షలు చెప్పేందుకు మంగళవారం నియోజక వర్గ నలుమూలల నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు నేతలు, మహిళా మండలి సభ్యులు, వివిధ కుల సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్ రావు, బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్ బీఆర్‌ఎస్ సీనియర్ నేత డి. సింహంతో పాటు ఇందిరానగర్ కళింగ సంఘం అధ్యక్షుడు పద్మారావు తదితరులు ఎమ్మెల్యేను సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: మెథడిస్ట్ కాలనీ 11 కేవీ ఫీడర్ కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మెథడిస్ట్ కాలనీ, రైల్వే ట్రాక్, సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల, రాక్ గార్డెన్ పార్క్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రీన్ లాండ్స్ సీబీడీ ఏడీఈ కిశోర్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా సెలబ్రిటీ క్లబ్, ఎస్‌బీఐ స్టాఫ్ కాలేజీ, విజువల్ సాఫ్ట్ 11కెవి ఫీడర్ ప్రకాశ్‌నగర్, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా చికోటీ గార్డెన్, ఎస్‌బీఐ స్టాఫ్ కళాశాల మెయిన్‌రోడ్డు, అమృత విల్లా, విజువల్ సాఫ్ట్ బిల్డింగ్, కుందన్‌బాగ్ బస్తీ, ఉమానగర్ వీధి నెంబర్-1 ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

నేటి నుంచి ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రాజ్‌కుమార్

వెంగళరావునగర్: గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేట్ రికగ్నైజేషన్ స్కూల్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు గిరిధర్ తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హాజరవుతారన్నారు. ఈ మేరకు మంగళవారం యూసుఫ్‌గూడ కార్పొరేటర్ బి.రాజ్‌కుమార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూసుఫ్‌గూడ పోలీస్‌గ్రౌండ్స్‌లో రన్నింగ్‌రేస్, కబడ్డీ, ఖోఖో, థగ్ ఆఫ్ వార్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.వి.కృష్ణ, కోశాధికారి ఆయుబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించాలి



జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలో నిధులు మంజూరైన అభివృద్ధి పనులను సాధ్యమైనంత త్వరగా మొదలు పెట్టాలని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి మంగళవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరైన వివరాలు అందజేశారు. చాలా కాలంగా అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు.

మూల మలుపు.. మృత్యు పిలుపు

ఐదేళ్ల వ్యవధిలో 30 మంది మృత్యువాత | తూతూ మంత్రంగా పోలీసుల చర్యలు | యధావిధిగా ప్రమాదాలు



బంజారాహిల్స్ రోడ్ నెం2లో రాయల్ టిఫిన్స్ వద్ద ఉన్న ప్రమాదకరమైన మూల మలుపు..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని మజీద్ ఎదుట రాయల్ టిఫిన్ సెంటర్ చౌరస్తా సమీపంలోని ప్రమాదకరమైన మలుపు వాహనదారుల పాలిట మృత్యు పిలుపుగా మారింది. ఏటా పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నా ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు జీహెచ్‌ఎంసీ అధికారుల్లో ఈ ప్రమాదాలకు కారణాలపై అధ్యయనం చేపట్టాలనే ధ్యాస కరువైంది. గత ఐదేళ్ల వ్యవధిలో ఈ మలుపు వద్ద 73 ప్రమాదాలు చోటు చేసుకోగా 30 మంది మృత్యువాతపడ్డారు. 262 మంది గాయాలతో ఇప్పటికీ అవస్థలు పడుతూనే ఉన్నారు. ఈ మలుపు వద్దకు రాగానే అదుపు తప్పిన వేగంతో కార్లు ఢీకొంటూ కారు నడుపుతున్న వారితో పాటు రోడ్డు దాటుతున్న వారిని బలిగొంటున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్న పోలీసులు ఆ తర్వాత పట్టించుకోవడం మానేస్తున్నారు. ఇంకోవైపు ఈ ప్రమాదాలు పోలీసులకు కాసులు కురిపిస్తున్నాయన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ప్రమాదానికి కారకులైన వారే కేసుల నుంచి తప్పించడంలో, చార్జిషీట్‌లో కేసులను నిర్వీర్యం చేయడంలో పోలీసులు తమ చేతులకు పని చెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రాయల్ టిఫిన్ సెంటర్ అడ్డు..

బంజారాహిల్స్‌లోని పార్క్‌హయత్ హోటల్ వైపు నుంచి పంజగుట్ట వైపు వస్తున్న వాహనాలు అదుపు తప్పిన వేగంతో దూసుకొస్తూ ఇక్కడ అడ్డుగా రాయల్ టిఫిన్ సెంటర్ గోడను ఢీ కొడుతూ వాహనాలు, పాదాచారులపై దూసుకెళ్తున్నారు. ఇక్కడ జరిగిన 70 శాతం ప్రమాదాలు ఈ టిఫిన్ సెంటర్ వద్దనే చోటు చేసుకోవడం గమనార్హం. అయినా టిఫిన్ సెంటర్ నిర్వహణ, నిర్వాకంపై పోలీసులు దృష్టి సారించడం లేదు. ఈ నెల 1న తెల్లవారుజామున ఈ ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు పాదచారులు మృతి చెందారు. అయితే ఇక్కడ సీసీ కెమెరా మాయమైనట్లు తెలుస్తోంది. ఇందుకు కారణాలపై



ఘటనా స్థలంలో పోలీసులు(ఫైల్)..

పోలీసులు నోరు మెదపడం లేదు.

స్పీడ్ బ్రేకర్ ఉండదా..?

జాతీయ రహదారి, వీవీఐపీ రాకపోకలు సాగించే రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడానికి పోలీసులు వెనుకడుగు వేస్తుంటారు. బంజారాహిల్స్ 2, 3 నిత్యం వీవీఐపీ రాకపోకలు సాగించే రోడ్డు కావడంతో నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు లేవు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి, రెయిన్‌బో ఆస్పత్రి, రాయల్ టిఫిన్ సెంటర్, టీవీ9 చౌరస్తా, ముఫకంజా కాలేజీ ఈ నాలుగు ప్రాంతాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. గతేడాది ఆయా ప్రాంతాల్లో 32 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

ఉత్తుత్తి బోర్డులే..

వాహనదారులను అప్రమత్తం చేసేందుకు ఇక్కడ రైట్, లెఫ్ట్ అంటూ కొన్ని సిగ్నళ్లు ఏర్పాటు చేశారు. అయితే పార్క్ హయత్ వైపు నుంచి వచ్చే వాహనదారులకు ఈ మలుపు వద్ద ఈ బోర్డులేవీ కనిపించవు. దీనికి తోడు ఇక్కడే రోడ్డు లోతుగా ఉండటమేగాక ఎడమవైపు రోడ్డు కూడా ఉంది. దీనికితోడు ఈ ప్రాంతంలోనే బస్టాప్ ఉండటం, రాయల్ టిఫిన్ సెంటర్ ముందు అక్రమ పార్కింగ్‌లు, వీటన్నింటికి తోడు రోడ్డు ఇరుగ్గా ఉంది. పాదచారులు ప్రతి నిమిషానికి ఒకరు అటూ, ఇటూ రోడ్డు దాటుతుంటారు. ఇన్ని సమస్యలున్న ఈ మలుపు వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వాహనదారుల పాలిట శాపంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



జలమండలి అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే దానం

ఫిలింనగర్: నియోజక వర్గంలో జరుగుతున్న సీవరేజి, మంచినీటి పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి అప్పగిస్తే జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు రోడ్డు పనులు మొదలు పెడతారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జలమండలి జీఎం హరిశంకర్, తట్టికాన, జూబ్లీహిల్స్ ఫిలింనగర్ సెక్షన్ మేనేజర్లు రాంబాబు, శ్రీహరి, పవన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం హరి శంకర్ మాట్లాడుతూ నిధులు మంజూరైన పనుల్లో దాదాపుగా 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని మరో 20 రోజుల్లో పూర్తి స్థాయిలో పనులు పూర్తి చేసి జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎన్‌ఓసీలు ఇస్తామని తెలిపారు. పనుల్లో నాణ్యత తగ్గకుండా స్థానికుల అవసరాలకు అనుగుణంగా పనులు చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ఈటీ నరసింహ

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో కొలువుల దందా నడుస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈటీ నరసింహ ఆరోపించారు. ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో 'ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలి' అంశంపై 'రౌండ్ టేబుల్ సమావేశం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఎస్‌ఐ. కానిస్టేబుల్ అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని ఆరోపించారు. వారికి న్యాయం జరిగే వరకు పోరాడతానని, అవసరమైతే జైలుకు వెళ్లేందుకు సిద్ధమన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. 4న అన్ని జిల్లాల్లో విలేకరుల సమావేశాల ఏర్పాటు. 5న సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సు, 6న దున్నపోతులకు వినతిపత్రం సమర్పన, 7న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా, 9న మంత్రుల కార్యాలయాల ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ధర్మేంద్ర, వలీ ఉల్లాఖాన్, నెర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏ సేవలను పునరుద్ధరించాలి

హిమాయత్‌నగర్: హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ఆర్టీఏ కార్యాలయాల్లో నెలరోజులుగా ఆటో డ్రైవర్లకు సంబంధించిన సేవలను నిలిపివేశారని, పాత ఆటోల స్థానంలో కొత్త ఆటోలు కొనుగోలు చేసేందుకు అవకాశం ఉన్నా స్క్రాప్ విధానం నిలుపుదల చేసినందున వేలాది మంది ఆటో డ్రైవర్లకు తీవ్ర నష్టం జరుగుతుందని రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నేతలు అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్‌లో నాయకులు వెంకటేశం, అమానుల్లా ఖాన్ విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎవరైనా ఆటో డ్రైవర్ కొత్త ఆటో కొనుక్కోవాలంటే పాత ఆటోను స్క్రాప్‌కు వేసి కొత్త ఆటో కొనుగోలు చేసేందుకు అవకాశం ఉండేదన్నారు. స్క్రాప్ విధానాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో ఆటో ధరలు విపరీతంగా పెరిగి బ్లాక్ మార్కెట్ జరుగుతుందని ఆరోపించారు. ఈ కారణంగా వేలాది మంది ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో ఫిట్నెస్, పర్మిట్ రెన్యువల్, కొత్త ఆటోల రిజిస్ట్రేషన్లు జరక్కపోవడంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొందరు ఆర్టీఏ ఏజెంట్లు యూనియన్ ముసుగులో ఉండి ఆర్టీఏ అధికారులపై స్క్రాప్ విధానంపై అనేకమైన ఆరోపణలు చేసి పనులు జరగకుండా సామాన్య ఆటో డ్రైవర్లకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో వి.కిరణ్, వి. మారయ్య, కృష్ణ, జి. మల్లేష్, ఎంఏ.సలీం, మీర్జా రఫాత్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఇంజినీర్ల సేవలు అభినందనీయం



డైరీని ఆవిష్కరిస్తున్న బాబురావు, శ్రీరామ్‌రెడ్డి

పంజాగుట్ట: రిటైర్డ్ ఇంజినీర్స్ సేవలు అభినందనీయమని ప్రొఫెసర్ డి.బాబురావు అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా వారు ప్రభుత్వానికి సేవలు అందిస్తున్నారన్నారు. మంగళవారం ఎర్రమంజిల్‌లోని కార్యాలయంలో 'అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ఇంజినీర్స్' 2023 నూతన సంవత్సర డైరీని వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్‌రెడ్డి, ప్రెసిడెంట్ రంగారావు, జనరల్ సెక్రటరీ పుల్లారెడ్డిలతో కలిసి ప్రొఫెసర్ డి.బాబురావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశానికి ఇంజినీరింగ్ వ్యవస్థ చాలా కీలకమన్నారు. 'అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ఇంజినీర్స్' సభ్యులు విధుల్లో చేరినప్పుడు ఎంత చిత్తశుద్ధిగా పనిచేశారో నేడూ అదే స్ఫూర్తితో సేవలు అందిస్తుండటం అభినందనీయమన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్‌రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వం తమపై ఎంతో నమ్మకంతో ఇప్పటికీ తమ సలహాలు, సూచనలు తీసుకోవడం..ప్రభుత్వ విజయంలో తాము భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు.

కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



నిమ్స్‌లో టీసీఓఎస్ కార్మిక సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న మంద కృష్ణ మాదిగ

లక్డీకాపూల్: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మనెంట్ చేస్తానని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి కేసీఆర్ నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాప అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం నిమ్స్‌లోని తెలంగాణ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రూపొందించిన జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమ సమయంలో నిమ్స్ కేంద్రంగా దీక్ష కొనసాగించి కేసీఆర్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఉద్యమానికి అండగా నిలబడ్డ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. గత 35 ఏళ్లుగా తక్కువ వేతనంతో పని చేస్తున్న కార్మికులకు గౌరవ వేతనం రూ.30 వేలు చెల్లించాలన్నారు. లేబర్ కమిషన్ నుంచి వచ్చే కరువు భత్యం, డీఏలు వెంటనే అమలు చేయాలని, మరణించిన కార్మికులకు ప్రత్యేక ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షులు ఎం.జే. యాదగిరి, నాయకులు ఎస్. బీమమ్మ, ఎం. ఆనంద్, జి. వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహారావు, గణేష్, మహేష్, విజయ్ పాల్గొన్నారు.

మంత్రి తలసాని నివాసంలో మహాపడి పూజ



సాక్షి, సిటీబ్యూరో: ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ వేదికగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి మంత్రి తలసాని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, మంత్రులు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకరరావు, జగదీష్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అరవింద్ కుమార్, టీఎస్‌ఎమ్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచారి, ఎమ్మెల్సీ తాతా మధు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్‌తో పాటు పలువురు అధికారులు, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

సంచార జాతులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న వీరస్వామి

పంజగుట్ట: ఎంబీసీ కార్పొరేషన్ లోని 35 కులాలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని సంచార జాతుల ఎంబీసీ సంక్షేమ సమితి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం సోమాజిగూడలో సావిత్రి బాయిపూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సమితి రాష్ట్ర అధ్యక్షులు కాటపల్లి వీరస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షులు చిందం పాండు వంశరాజ్ మాట్లాడుతూ .. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంచారజాతులకు చెందిన 35 కులాలను ఆర్థికంగా చేయూతనందించడమే కాకుండా, విద్యాపరంగా ఎదగాలనే ఉద్దేశంతో జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో వారికి 5 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. కొందరు బీసీ నాయకులు బీసీ జాబితా నుండి తొలగించిన 27 కులాలను తిరిగి బీసీల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారని వారిని బీసీల్లో కలిపితే సంచారజాతులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ లోని 35 కులాలకు ఎంబిసి కుల ధృవీకరణ పత్రం ఇచ్చి అన్నింటిలో 5 శాతం రిజర్వేషన్లు కల్పించాని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సమితి న్యాయ సలహాదారులు అబ్బు లింగం, ప్రధానకార్యదర్శి లక్ష్మణరావు, కోశాధికారి లక్ష్మీనారాయణ, గోపాల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

గ్రంథాలయ సేవలను మరింత మెరుగు పర్చాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న కార్యదర్శి పద్మజ

రహమత్‌నగర్: గ్రంథాలయ సేవలను మరింత మెరుగు పర్చాలని నగర కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి పి. పద్మజ అన్నారు. మంగళవారం ఆమె వార్షిక తనిఖీల్లో భాగంగా రహమత్‌నగర్ గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠకుల సంఖ్య మరింత పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో మూత్ర విసర్జన చేస్తుండటంతో గ్రంథాలయంలోకి దుర్వాసన వస్తుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆమె స్పందిస్తూ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులను ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

చదువే ఆయుధం



సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కూనంనేని

హిమాయత్‌నగర్: దేశంలోనే మొదటి ఉపాధ్యాయిని సావిత్రిబాయి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పూలే ఆశయాలను ప్రతి ఒక్కరు ఆచరించాలన్నారు. సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో రాష్ట్ర బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి తదితరులు సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ..చదువు ప్రధాన ఆయుధమని ఆనాడే సావిత్రిబాయి చెప్పారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరిని విద్య వైపు మళ్లించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో

మహిళల స్థితిగతులను మార్చాలని సంకల్పించిన మొదటి మహిళ సావిత్రి బాయి పూలే అని భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్. ఛాయాదేవి, అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి వలి ఉల్లాహ్ ఖాద్రి, కె. ధర్మేంద్ర అన్నారు. సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద మంగళవారం సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు.


ఎస్‌టీయూటీఎస్ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ ఐఓఎస్ రామలింగయ్య

బంజారాహిల్స్: స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్(ఎస్‌టీయూటీఎస్) నూతన సంవత్సరం(2023) డైరీ, కేలండర్‌ను విద్యాశాఖ షేక్‌పేట మండల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ రామలింగయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ స్టేట్ హెడ్‌క్వార్టర్ సెక్రటరీ, ఫిలింనగర్ అంబేద్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం టి. పోల్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ వై.కరుణాకర్‌రెడ్డి, మండల యూనియన్ అధ్యక్షుడు ఎం. గోపాల్, గోవర్ధన్ రెడ్డి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళల అభివృద్ధి



సావిత్రీబాయి పూలేకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

హిమాయత్‌నగర్: దేశంలో ఎక్కడలేని విధంగా మహిళల సంక్షేమం, వికాసం, బాలికల విద్య, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు విద్యలో రాణిస్తే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని భావించిన సావిత్రిబాయి పూలే ఎన్నో అవమానాలను ఎదుర్కొని విద్యాసంస్థలను స్థాపించి మహిళల్లో చైతన్యం తీసుకువచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీను, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ బొక్క శ్రీనివాస్, నాయకులు రంజిత్, చంద్రశేఖర్, సతీష్, సత్తయ్య పాల్గొన్నారు.

ఘన నివాళి

సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని పలు కూడళ్ల కార్యాలయాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పలు రాజకీయ పార్టీల నేతలు, అధికారులు, అనధికార ప్రముఖులు పాల్గొన్నారు. మహిళా విద్యాభ్యున్నతికి సావిత్రీ బాయి చేసిన సేవలను కొనియాడారు.

– ఖైరతాబాద్ జోన్ బృందం



ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో..



మహిళలను సత్కరిస్తున్న గంట మల్లేష్



మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న బీఎస్పీ నేతలు



బీసీ దళ్ ఆధ్వర్యంలో..